క్లుప్తంగా

బతుకమ్మ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక

బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సామ్యారెడ్డి



బతుకమ్మలతో సామ్యారెడ్డి తదితరులు

కుల్కచర్ల: బతుకమ్మ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అని బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సామ్యారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ఓ స్కూల్లో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చరిత్రను నేటి తరం విద్యార్థులకు తెలియజేసేందుకు పాఠశాలలో నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అర్చన ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

రేపు మారథాన్ రన్

తాండూరు టౌన్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా ఆదివారం నమో యువ రన్ పేరుతో 2కె మారథాన్ నిర్వహించనున్నట్లు బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విలియంమూన్ మైదానం నుంచి రాజీవ్‌కాలనీ బైపాస్ రోడ్డు వరకు ఉదయం 7గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కావున క్రీడాకారులు, బీజేపీ, బీజేవైఎం, ఏబీవీపీ, వీహెచ్‌పీ, హిందూ వాహిని, మోదీ అభిమానులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పార్టీలకతీతంగా పాల్గొనాలని కోరారు.

రమాదేవికి సర్టిఫికెట్ ప్రదానం



సర్టిఫికెట్ అందజేస్తున్న డీఈఓ రేణుకాదేవి

తాండూరు రూరల్: గౌతపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న గణిత ఉపాధ్యాయురాలు రమాదేవికి సర్టిఫికెట్ ప్రదానం చేశారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి టీఎల్ఎం మేళాలో గణిత బోధన నమూనాలో రెండో బహుమతి లభించింది. ఈ సందర్భంగా డీఈఓ రేణుకాదేవి ఆమెకు ప్రదానం చేశారు. పీఆర్టీయూ మండల అధ్యక్షురాలు జొన్నల వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి రమాదేవిని అభినందించారు.

గ్రామాల్లో ఆవాస్ యోజన సర్వే

తాండూరు రూరల్: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామంలోని అర్హులను గుర్తించడానికి ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా పంచాయతీ కార్యదర్శులు సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతీ కుటుంబ వివరాలు సేకరించి నమోదు చేస్తున్నామని ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు. మండలంలో మొత్తం 33 గ్రామాల్లో 6,401 ఇళ్లను సర్వే చేయనున్నామని చెప్పారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు తీసుకొని యాప్‌లో నమోదు చేస్తారన్నారు. ఆవాస్ యోజన కింద ఎంపికైన లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ.72వేలు అందించనుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా కేంద్రం వాటా కూడా ఉంటుందని ఎంపీడీఓ వివరించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ వందన, డాక్టర్ స్మృతి, డాక్టర్ విద్య, డాక్టర్ హర్ష సమక్షంలో సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వందన మాట్లాడుతూ..ఈ వైద్య శిబిరంలో వందకు పైగా పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. ఈ నెల 23న ఈఎన్‌టీకి సంబంధించిన వైద్య పరీక్షలు, 26న చర్మ, 30న దంత సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విజయ లక్ష్మి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన తప్పనిసరి

- ఆకట్టుకున్న పీఎంశ్రీ బాలుర ఉన్నత పాఠశాల ఎన్నికలు
- సాధారణ ఎలక్షన్ తీరులో నిర్వహించిన పోలింగ్
- ఓటు వినియోగించుకున్న విద్యార్థులు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న విద్యార్థులు



హెడ్ బోయ్ సాయికిరణ్



హెడ్‌గర్ల్ అర్చన



సిరా పెడుతున్న విద్యార్థి

యాలాల: మండల కేంద్రంలోని పీఎంశ్రీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ కమిటీ ఎన్నికలు అట్టహాసంగా నిర్వహించారు. ఏడాది కాలానికి గాను పదోతరగతి విద్యార్థులు హెడ్ బోయ్, హెడ్ గర్ల్ పదవులకు పోటీ పడ్డారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 544 మంది విద్యార్థులుండగా, శుక్రవారం 437 మంది ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. పదో తరగతి నుంచి హెడ్‌గర్ల్‌కు 7 మంది, హెడ్ బోయ్‌కి 8 మంది పోటీపడ్డారు. కాగా పోలింగ్ ప్రక్రియ సాధారణ ఎన్నికలను తలపించే విధంగా నిర్వహించారు. నమూన ఈవీఎంల కోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఓటు హక్కు వినియోగించుకున్న తరువాత బీప్ సౌండ్ వస్తుండటంతో ఎంతో ఉల్లాసంగా కనిపించారు. కాగా హెడ్ బోయ్ పదవికి సాయికిరణ్(170 ఓట్లు), హెడ్ గర్ల్ అర్చన(120 ఓట్లు) సాధించి గెలుపొందినట్లు ఎన్నికల నిర్వాహకులు ప్రకటించారు. పాఠశాల హెచ్ఎం సిద్రామేశ్వర్, ఉపాధ్యాయ బృందం రవీందర్‌రెడ్డి, వెంకటేశ్ ప్రసాద్, భాను చైతన్య, బలరాం, శేఖర్, రవీంద్రనాథ్, శ్రీనివాస్, అర్చన, శాంతి పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించకపోవడం బాధాకరం

బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య



ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

అనంతగిరి: సమస్యల పరిష్కారం కోసం స్పందించకపోవడం బాధాకరమని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య పేర్కొన్నారు. స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. శుక్రవారం వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో బీఆర్ఎస్‌వీ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే అన్ని చెల్లిస్తానని చెప్పి 20 నెలలు దాటినా హామీలు అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అందాల పోటీల నిర్వహణ, మూసీ సుందరీకరణ, ఫోర్త్ సిటీ నిర్మించడానికి లక్షల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వానికి పేదల చదువు పట్టదా? అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా చేస్తున్న విద్యార్థులను, నాయకులను పోలీసులు అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో జుబేర్, అజయ్, సర్ప రాజ్, పర్వేజ్, సురేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గొప్పది

ఎంపీడీఓ గ్యామా



మాధురిని సన్మానిస్తున్న ఎంపీడీఓ గ్యామా తదితరులు

దోమ: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గొప్పదని ఎంపీడీఓ గ్యామా అన్నారు. శుక్రవారం బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మండల విద్యాధికారి వెంకట్ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓతో కలిసి ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదువుకోవాలన్నారు.

మాధురికి ఘన సన్మానం

గణిత శాస్త్రంలో మండల ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన మాధురిని ఎంపీడీఓ గ్యామా, విద్యాధికారి వెంకట్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షఫీ, స్కూల్ చైర్మన్ పిలికిభాయ్, మాజీ చైర్మన్ అనంతయ్య, ఉపాధ్యాయులు ప్రవీణ్, ముత్యప్ప, నరేందర్, ఖయ్యూమ్, విజయసాయి, అనంతయ్య, మాధురి, రుక్మిణి, స్వప్న, జరీన, కల్పలత, వెంకటయ్య, సీఆర్పీ వెంకటేష్, పీఈటీ మల్లేశం, జంగయ్య, గ్రామస్తులు శేఖర్, రమేష్, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



దుద్యాల్: విద్యార్థుల మానవహారం



యాలాల: లక్ష్మీనారాయణపూర్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న యాదయ్య



పూడూరు: మొక్కలు నాటుతున్న వైద్యాధికారి మహమ్మద్ ఇక్బాల్ ఫారూఖి తదితరులు

పూడూరు: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చన్గోముల్ వైద్యాధికారి మహమ్మద్ ఇక్బాల్ ఫారూకి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చన్గోముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి పీహెచ్ఎన్ షాహిదాబీ, ఫార్మాసిస్టు రవికుమార్, ల్యాబ్‌టెక్నీషియన్ సాజిద్ అలీ, సిబ్బంది దాసు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతే ముఖ్యం

యాలాల: పరిసరాల పరిశుభ్రతే ముఖ్యమని మండల పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. మండలంలోని అగ్గనూరు, లక్ష్మీనారాయణపూర్ గ్రామాల్లో స్వచ్ఛతాహి సేవ నిర్వహించారు. అగ్గనూరులో ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. లక్ష్మీనారాయణపూర్ ప్రాథమిక పాఠశాలలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు రమాదేవి, తారకచారి పాల్గొన్నారు.

లగచర్ల పాఠశాలలో స్వచ్ఛతపై అవగాహన

దుద్యాల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీవో మహేశ్ కుమార్ పేర్కొన్నారు. లగచర్ల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హి సేవలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రతను పాటించాలన్నారు. పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం తేజస్విని, ఎంపీవో సత్య నారాయణ, పంచాయతీ కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

పరిగి: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండొచ్చని కాంగ్రెస్ జిల్లా నాయకుడు వెంకటేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. గ్రామంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి, శ్రమదానం చేశారు. స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బిచ్చయ్య, కాంగ్రెస్ గ్రామ ఉపాధ్యక్షుడు రాకేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



కొడంగల్ రూరల్: శిక్షణా తరగతుల్లో సూచనలందిస్తున్న సూపర్‌వైజర్ ప్రభ

దుద్యాల్: ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని దుద్యాల్ క్లస్టర్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయశ్రీ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషకాహార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎక్కువగా కూరగాయలు తినాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు పోషకాలు అధికంగా ఉన్న ఆహార పదార్థాలు తరచూ తినాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం–పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

కొడంగల్ రూరల్: పోషకాహార లోపం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని సీడీపీఓ రూప, రుద్రారం సూపర్‌వైజర్ దశమ్మ, హస్నాబాద్ సెక్టార్ సూపర్‌వైజర్ ప్రభ సూచించారు. శుక్రవారం రావులపల్లి గ్రామ రైతు వేదికలో రుద్రారం సెక్టార్ పరిధిలో దశమ్మ, హస్నాబాద్ సెక్టార్ పరిధి, దౌల్తాబాద్ మండలంలోని బాలంపేట పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందికి సూపర్‌వైజర్ ప్రభ అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్ బీ-పడాయి బీ అంశాలకు సంబంధించి శిక్షణను అందించారు. పోషకాహారం, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ, ఫలితాల్లో మెరుగుదలను వేగవంతం చేయడమే శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కౌమార దశలో బాలికలకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 0నుంచి 3 ఏళ్ల పిల్లలకు 'నవచేతన', 3నుంచి6 ఏళ్లలోపు పిల్లలకు 'ఆదర్శ శీలా' అంశాలపై అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అంగన్‌వాడీ సిబ్బంది, సుదినారాణి, యాదమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్



మాట్లాడుతున్న ఆంజనేయులు ముదిరాజ్

కుల్కచర్ల: విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపహాడ్ గ్రామంలోని జెడ్పీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ..మధ్యాహ్న భోజనం గురించి ఆరా తీశారు. ఉపాధ్యాయుల బోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఎద్దైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలన్నారు. కుల్కచర్ల మండలంలో ఏ పాఠశాలలో కూడా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావచ్చన్నారు. పౌష్టికాహారం వడ్డించేవిధంగా చర్యలు తీసుకోవాలని వంటనిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంబదాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేంద్ర బహదూర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం ఎన్నిక



నూతన సభ్యులను సన్మానించిన విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగులు

యాలాల: విశ్రాంత, ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని నగరేశ్వరాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గ సంఘాన్ని నియమించారు. సంఘం అధ్యక్షుడిగా సీహెచ్ రాజారత్నం, అసోసియేట్ అధ్యక్షుడిగా సీహెచ్ హన్మయ్య, ఉపాధ్యక్షుడిగా హరిశ్చందర్, సత్యమ్మ, ప్రధాన కార్యదర్శిగా నర్సిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సంగయ్య, ప్రచార కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా బాలయ్య, సంయుక్త కార్యదర్శిగా పాపయ్యలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా సత్యశివప్ప, రాములు, ఎన్నికల పరిశీలకులుగా శేఖర్, మొగులయ్య, దశరథ్‌లు వ్యవహరించారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు రాజారత్నం తెలిపారు. అనంతరం కొత్త కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

పదోన్నతి హర్షణీయం

మండల విద్యాధికారి వెంకట్

దోమ: ఉపాధ్యాయులకు పదోన్నతులు రావడం హర్షణీయమని మండల విద్యాధికారి వెంకట్ అన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని దోర్నాల్‌పల్లి పాఠశాలలో విధులు నిర్వహించిన వసురాంకు పదోన్నతి రావడంతో మేడిపల్లికలాన్ పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఉపాధ్యాయులు ఏ పాఠశాలలో విధులు నిర్వహించినా బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేవిధంగా బోధన చేపట్టాలని సూచించారు. అనంతరం పాఠశాలకు వసురాం రూ.4 వేల ఆట వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయులు శివ, మల్లేశ్, సీఆర్‌పీ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



దోర్నాల్‌పల్లి పాఠశాలలో వసురాంను సన్మానిస్తున్న మండల విద్యాధికారి వెంకట్

ఆదర్శవంతంగా ఉండాలి

అనంతగిరి: విద్యతో పాటు నైతిక విలువలు బోధించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి పేర్కొన్నారు. వికారాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువందనం నిర్వహించి పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిరంతరం మారుతున్న బోధనాభ్యసన ప్రక్రియలకు అనుగుణంగా నవీకరణ కావాలన్నారు. అనంతరం సన్మాన గ్రహీత జాక వెంకటేశం మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలతో పాటు విద్యార్థుల అభివృద్ధికి తపస్ పనిచేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాఘవేందర్, కార్యదర్శి సంతోశ్ కుమార్, మండల కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు బస్వరాజ్, వికారాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ప్రసాద్ కుమార్, తపస్ జిల్లా బాధ్యులు కృష్ణారెడ్డి, మల్లేశం స్వామి, నర్సింలు, సురేందర్ రెడ్డి, సంగమేశ్వర్, మండల బాధ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అనంతగిరి: సన్మానిస్తున్న తపస్ నాయకులు

దసరా తరహాలో ఊరంతా బతుకమ్మ

జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు జయమ్మ



నిర్వాహకులతో జయమ్మ తదితరులు

నవాబ్‌పేట: దసరా తరహాలో ఊరంతా బతుకమ్మ నిర్వహించుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కాలె జయమ్మ తెలిపారు. ఈ నెల 29న చించల్‌పేటలో ఘనంగా జరుపుకోనున్నట్లు ఆమె పేర్కొన్నారు. శుక్రవారం చించల్‌పేటలో నిర్వహించనున్న బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభుత్వం చీరలు అందజేస్తూ ఆడపడుచులకు ఆనందం పంచుతోందన్నారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే కాలెయాదయ్య, జోగు శ్యామలాదేవి, ప్రముఖ గాయని మమత రమేశ్ పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, శివ, గ్రామనాయకులు వెంకట్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గ్రామసంఘం ప్రతినిధులు శీలా, వనజ, ఇందిర, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



యాలాల: చెక్కు అందిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు

కుల్కచర్ల: సీఎం సహాయనిధి పేదలకు వరమని చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్సాటి అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరుపేదలకు మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ప్రభుత్వం సాయం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, సలీం, మండల ఉపాధ్యక్షుడు నరసింహ నాయక్, మాజీ ఎంపీటీసీ పుట్ట యాదయ్య, నాయకులు అనంతరెడ్డి, చందర్, గోపీ, బాలు, రాము, రతన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

యాలాల: జుంటుపల్లి గ్రామానికి చెందిన ఇసాక్‌కు మంజూరైన రూ.60వేల చెక్కును శుక్రవారం చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అందజేశారు. ఇసాక్‌కు ఇటీవల గుండెపోటు రావడంతో ప్రైవేట్‌లో చికిత్స నిమిత్తం దరఖాస్తు చేసుకున్నారు. మంజూరైన చెక్కును అందజేశారు. అనంతరం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ..పేదలకు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జుంటుపల్లి మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, సిద్ధయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరమని మాజీ ఎంపీటీసీ దస్తప్ప అన్నారు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న మండలంలోని దౌల్తాబాద్ గ్రామానికి చెందిన చాకలిహన్మంతుకు రూ.50వేలు, కోళ్ల చిన్నకిష్టప్పకు రూ.50వేలు, కుర్మని అనితకు రూ.35వేలు, నాటకారి లక్ష్మప్పకు రూ.50వేలు ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు.



దుద్యాల్: చెక్కు అందజేస్తున్న నాయకులు



కుల్కచర్లలో చెక్కు ఇస్తున్న నాయకులు

కాంగ్రెస్‌తోనే పేదలకు భరోసా

దుద్యాల్: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు భరోసా ఉంటుందని కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ పేర్కొన్నారు. దుద్యాల్ గ్రామానికి చెందిన లాల్‌కోట సర్సమ్మకు రూ.6 వేలు, గోవిందుగారి చెన్నమ్మకు రూ.60వేలు మంజూరైన చెక్కులను జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్యతో కలిసి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం ప్రభుత్వం సాయం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం గౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణ, మాజీ సర్పంచ్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.